# నమస్కారం

"నమస్కారం సార్" తన ముఖ్యెుకటో నమస్కారం చేశాడు సుబ్బారావు.

"ఏమిటోయ్ సుబ్బారావ్, ఏదో పనుండి వచ్చినట్టున్నావ్"

"ఏం లేదు సార్. విజయబాబు గారుఎలా వున్నరో కనుక్కుందామని వచ్చాను. రెండు ఉత్తరాలు రాసినా జవాబు లేదు సార్" అందమైన అబద్ధం ఆడాడు.

"వాడికేమోయ్. వాడు మహర్జాతకుడు. మనమే ఇలా గుండేది" కొడుకు విషయం చెబుతూంటే ఎంతో గర్వంగా ఫీలవుతున్నాడు ఎమ్మెల్యే.

"ఈసారి ఉత్తరంలో నా నమస్కారాలు తెలియజేయండి"

'బోడి నమస్కారాలు తప్ప ఇంక దేనికీ పనికిరావు' సుబ్బారావు వైపు పరాన్నజీవిని చూసినట్లు చూశాడు.

ఎమ్మెల్యే గారి భార్య, భర్తకు కాఫీతెస్తూ సుబ్బారావుని చూసి "అరె సుబ్బారావ్ ఎప్పుడొచ్చావోయ్, నీక్కూడా కాఫీ తెమ్మంటానుండు" అంటూ లోపలికి కేకేసింది. పని మనిషి కాఫీతెచ్చి సుబ్బారావుకి ఇచ్చింది.

సుబ్బారావు ఈ ఆకస్మిక అభిమానాన్ని భరించలేక ఏదో అనుమానమొచ్చి "అమ్మా! మార్కెట్‌కు వెళ్ళి కూరగాయలు తెమ్మంటారా" అని విన్నవించుకున్నాడు.

"నాయనా సుబ్బారావ్ నువ్వు మావాడి స్నేహితుడవు. నీచేత కూరగాయలు తెప్పిస్తామా. మాకు పనిమనుషులున్నారు గదా" తృప్తిగా అందామె.

"నన్ను ఎలా భావించినా ఫరవాలేదు నాకుమాత్రం ఏదయినా పని చెప్పండి" తిరుగులేనట్లు అడిగాడు.

"సరే నాయనా... ఏదో సరదాపడుతున్నావ్ నీ కోరిక నేనెందుకు కాదనాలి. కాస్త ఆ గదిలో బూజు దులిపిపెట్టు నాయనా, పనిమనిషికి అందడం లేదు" అంటూ ఓమూల గది చూపించింది.

"అలాగేనండీ అమ్మగారూ" అంటూ కాఫీ త్రాగడం పూర్తిచేసి గదిలోకి వెళ్ళి చీపురు, గది తుడిచే వెదురుగడ అందుకొన్నాడు.

సుబ్బారావు గదంతా పూర్తిగా తుడిచి బయటకు వచ్చేసరికి గంటయింది.

ఇప్పుడు అతనికి క్రొత్తరూపం వచ్చేసింది. గుడ్డలంతా నల్లగా అయిపోయాయి. తలంతా బూజుతో వేళ్ళాడుతూ అప్పుడే దీర్ఘ తపస్సులోంచి లేచివచ్చిన మునిలా ఉన్నాడు.

"చాలా సహాయం చేశావు నాయనా. ఏదో పనిమీద వచ్చినట్టున్నావ్. అదేమిటో చెప్పు" అంది ఎమ్మెల్యేగారి భార్య సుబ్బారావు శ్రమని గుర్తించి. సుబ్బారావు నీళ్ళు నమిలాడు.

"సందేహించక చెప్పు నాయనా"

సుబ్బారావు నెత్తిమీద వేలాడే బూజును ఒక చేత్తో తీసుకుంటూ "తమరు దయతలిస్తే ఒకటి చెబుతానండీ" అంటూ వినయం నటించి, అయ్యగారు దయతలచినట్లు చెప్పకముందే అసలు విషయం తన హావభావ ప్రకటనలను జోడించి చెప్పాడు.

"సార్ ఈ ఉద్యోగం తప్పక వస్తుందని నా బావమరిదికి ప్రామిస్ చేశాను. ఈ సహాయం చేయలేకపోతే మా మామగారి ముందు తలెత్తుకుని తిరగలేను సార్. నా పెళ్ళాం పుట్టింటికి పోతుంది. పిల్లలు మాట వినరు. నా ప్రెస్టేజి ఈ ఇష్యూమీద ఆధారపడి ఉంది సార్" మొరపెట్టుకున్నాడు సుబ్బారావు.

ఎమ్మెల్యే గారు ఇబ్బందిగా ముఖం పెట్టి "అరెరె ... సుబ్బారావ్! ఇంకొంచెం ముందు రావలిసింది. దాన్ని మా దూరపు బంధువుల అబ్బాయి నారాయణకు ఇప్పిస్తానని మాటిచ్చాను ఏమనుకోక" బాధపడుతూ అన్నాడు.

"సార్... సార్... అమ్మగారూ... అమ్మగారూ" ఆవు తంతూంటే దూడపాల కోసం ఎగబాకినట్టుంది సుబ్బారావు బ్రతిమిలాడడం.

"సుబ్బారావ్ వర్రీకాకు. ఈసారి అదెంత పనయినా నీకే చేస్తాను" అంటూ ఎమ్మెల్యేగారు టేబుల్ సొరుగులోంచి ఒక కవరు తీశాడు. "ఇది నారాయణకు ఉద్యోగం ఇవ్వవలసినది అని వ్రాసివున్న ఉత్తరం. నమ్మకస్తుడవని నీకిస్తున్నాను. జాగ్రత్తగా తీసుకెళ్ళి మేనేజరుకివ్వు" అంటూ కవరు సుబ్బారావు చేతిలో పెట్టాడు.

సుబ్బారావు కారబోయే కన్నీటిని రెప్పలతో ఆనకట్ట కట్టి, వచ్చే ఏడుపును గొంతు దగ్గర బిగపట్టాడు. దీనికి అమ్మగారు కూడా తన ఓదార్పు మాటలతో కొంత సాయపడ్డారు. తినవలసిన ఆహారాన్ని తన చేతుల మీదుగా ఇంకొకరికి ఇవ్వవలసిన పరిస్థితి ఏర్పడినట్టు ఉత్తరం తీసుకుని బయలుదేరాడు.

సుబ్బారావుకి ఇతరుల ఉత్తరాలు చదవడమంటే ఐస్‌క్రీమ్ తిన్నట్లుంటుంది. దారిలో దాన్ని విప్పి పూర్తిగా చదివాడు. 'ఎట్టి పరిస్థితుల్లోను ఈ ఉద్యోగం నారాయణకివ్వాలి' అని స్ట్రాంగుగా రాసి వుంది అందులో. ఇంటికి వెళ్ళే సరికి ఆతృతగా ఎదురుచూస్తున్న తన బావమరిది నారాయణ, ఆశగా చూస్తున్న భార్య అలివేలు తనచుట్టూ చేరి చేతులు పట్టుకుని వున్న పిల్లల్ని చూసేసరికి అతనికి ఒక పరిష్కారం మెదిలింది. అందరికీ ధైర్యం చెప్పాడు.

కుటుంబ సభ్యులంతా నిద్రాదేవి ఒడిలో వాలిన తరువాత సదరు ఉత్తరాన్ని బయటకు తీశాడు సుబ్బారావు. అతి చాకచక్యంగా 'కె' అనే ఇంగ్లీషు అక్షరాన్ని 'ఆర్'గా రుద్దేశాడు. ఫలితంగా తన బావమరిది ఆర్ నారయణకు ఉద్యోగం వస్తుంది.

మరునాడు ఉదయం ఉత్తరం మేనేజరుకి అందించడం, ఆయన ఆ ఉత్తరం చూసి తన ప్రమోషనుకు ప్లాను వేసుకుంటూ ఆనందంగా సుబ్బారావు బావమరిదికి ఉద్యోగం ఇవ్వడం జరిగిపోయింది. సుబ్బారావు బావమరిది ఎగిరి గంతేసి ఊహల్ని రెక్కలు చేసుకుని ఊరికెళ్ళి బావగారి ఘనతను తల్లి దండ్రులకు చెప్పివచ్చి ఉద్యోగంలో చేరిపోయాడు. ఎమ్మెల్యే

గారు ఏంచేస్తారోనని ఒకవైపు భయపడుతూనే, ఊళ్లో మామగారి దగ్గర తన పరపతి పెరిగినందున పరమానందం చెందాడు. 'సుబ్బారావుది తలకాయంత గుండె' అన్న స్నేహితుల ఉవాచ ఇప్పుడు నిజమయింది.

సుబ్బారావు ఇలా తన బంధువర్గానికి, స్నేహితులకి, ముఖం ఎరిగినవాళ్లకి ప్రజాహిత కార్యాలు చేస్తుండగా పదిహేను రోజుల తర్వాత ఒక ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గారి దగ్గర నుండి ఆహ్వానం వచ్చింది. సుబ్బారావుకి ఏం చేయాలో తోచక అలాగే వుండిపోయాడు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు మరలా పిలుపు రావడంతో బయలుదేరక తప్పలేదు.

సుబ్బారావు ఎమ్మెల్యే ఇంటి ముందుకొచ్చే సరికి మెయిన్ గేటులోంచి బయటకు వస్తూ ఆయనగారి కారు కనిపించింది. డ్రైవరుకు చేయి చాపి కారు ఆపాడు. కారులో డ్రైవరు మాత్రమే వున్నాడు. "సాబ్! అమ్మగారు హైదరాబాదు నుంచి వస్తున్నారు. స్టేషన్‌కు వెళుతున్నాను"

"అలాగా! అయితే నేనూ వస్తానుండు" అంటూ డోర్ తీసుకుని ఫ్రంట్ సీటులో కూర్చున్నాడు.

సుబ్బారావుకు ఆకుటుంబంతో వున్న సాన్నిహిత్యం డ్రైవరుకు తెలిసి వుండడంతో మరేం అనలేదు. కారు రైల్వే స్టేషనుకు చేరుకుంది.

సుబ్బారావు ఆలోచనల వేడితో కాలి పోతున్నాడు. ఎన్నెన్నో ప్లాన్లు వేస్తున్నాడు. ఏ ప్లానూ సమంజసంగా వుండడం లేదు. తను చేసింది చిన్న పనేమీగాదు. మోసంతో తన బావమరిదికి ఉద్యోగం ఇప్పించుకున్నాడు. అంత వరకూ బాగానే వుంది. కాని ప్రస్తుతం ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవడమెలా? ఆలోచిస్తున్న అతనికి ఎంతో సేపటికిగాని ఒక అయిడియా రాలేదు. ఆ అయిడియా ప్రకారం అసలు విషయం చెప్పకుండా అమ్మగారి దగ్గర అభయ హస్తం తీసుకోవడం, తర్వాత ఎమ్మెల్యే గారిమీద శర పరంపరగా నమస్కార బాణవర్షం కురిపించి దాన్ని మాఫీ చేసుకోవడం!

ఇంతలో ట్రెయిను వచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది. అమ్మగారు ట్రెయిన్‌లోంచి దిగారు. సుబ్బారావు చిరునవ్వు నవ్వి ఒక విలువైన నమస్కారబాణం వదిలాడు.

పోర్టరు, డ్రైవరుతో పోట్లాడి. మెడకొకటి, నెత్తినొకటి, చేతుల్లో రెండు బ్యాగులు పుచ్చుకొన్నాడు. పోర్టరు రూలు పొజిషన్ వివరిస్తే, సుబ్బారావు అమ్మగారి హోదాను నాలుగెత్తులు పెంచి తెల్లవారి ఇంటికొస్తే నాలుగు రూపాయలు ఇస్తుందని చెప్పాడు.

సుబ్బారావు డ్రైవరు సహాయం లేకుండానే సామానంతా డిక్కీలో సర్దాడు. అమ్మగారు సుబ్బారావు వినయవిధేయతలకు ఎంతో ఆనందించింది. సుబ్బారావు జరిగిన విషయం

చెప్పకుండా అయ్యగారు తన మీద కోపంగా వున్నారని, తనను రక్షించాలని కోరాడు. అమ్మగారు శ్రీకృష్ణుడు ఫోజుపెట్టి అభయమిచ్చింది.

ఇంట్లోకి వచ్చిన భార్యను ఎంతో ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే గారు, సామానులతో వెనుకవచ్చే సుబ్బారావుని చూసి ఉరిమి చూసాడు, అతని కళ్ళు తీక్షణంగా మారాయి.

"నేను చెప్పిందేమిటి? నువ్వు చేసిందేమిటి" గద్దించాడు.

"మీరు సుబ్బారావుని ఏమనకండి. అతను చాలా మంచి వాడు" అంటూ లోపలికి వెళ్ళింది ఎమ్మెల్యేగారి భార్య.

అమ్మగారి వెనుకనే తలవంచుకుని వెళ్ళబోయిన సుబ్బారావుని "ఆగు" అంటూ హుంకరించాడు.

"సార్ తప్పయిపోయింది, క్షమించడండి" తన అంబుల పొదలోంచి ఒక బాణం తీసి వదిలాడు రెండు చేతులు మోడ్చి నమస్కరిస్తూ.

ఆయన ఉగ్రుడయిపోయాడు. "నీవు చేసింది చిన్న తప్పనుకొన్నావా క్షమించడానికి. నన్ను చీట్ చేసావు. ఈ ఊళ్ళో నన్ను మోసం చేయగల ధైర్యం ఇప్పటి వరకూ ఎవడికీ లేదు" తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు.

సుబ్బారావు తన అంబులపొదిలోంచి వరుసగా ఆగ్నేయాస్త్రము, వాయవ్యాస్త్రము వదలడం మొదలు పెట్టాడు. మొదట నిటారుగా నిలబడి రెండు చేతులతో నమస్కరించాడు. తరువాత వంగి నమస్కరించాడు. చివరగా మోకాళ్ళమీద కూర్చొని నమస్కరించాడు. అయినా ఎమ్మెల్యే గారు తన తిట్ల ప్రవాహం ఆపలేదు. "ఇక లాభం లేదు బ్రహ్మాస్త్రం ఉపయోగించక తప్పదు" అనుకొన్నాడు. అనుకొని చుట్టూ చూసాడు ఎవరయినా ఉన్నారేమోనని. సుబ్బారావుకు బ్రహ్మాస్త్రం వదిలేముందు అలా చూడడం అలవాటు. బ్రహ్మాస్త్రం యొక్క విలువ అటువంటిది.

ఎవరూలేరని తీర్మానించుకుని తరువాత తన అంబులపొదిలోంచి బ్రహ్మాస్త్రం తీసి వదిలాడు. సుబ్బారావు ఒక్కసారిగా బోర్లాపడి ఆయన రెండు కాళ్ళూ పట్టుకొన్నాడు. ఆయన పడబోయి పక్కనే వున్న స్థంభం ఆధారం చేసుకొని నిలబడ్డాడు. అయినా సుబ్బారావు కాళ్ళు వదల్లేదు. చివరకు సుబ్బారావు వదిలిన బ్రహ్మాస్త్రం ధాటికి ఆయన గారు చల్లబడక తప్పలేదు.

ఈ లోపల అమ్మగారు స్నానంగట్రా చేసి హాల్లోకి వచ్చారు. ప్రస్తుత సన్నివేశం చూసి "ఇంకా మీరు సుబ్బారావుని వదిలి పెట్టలేదా" అంది కోపంగా.

"నేనెప్పుడో వదిలి పెట్టాను, అతనే నన్ను వదలడం లేదు" అన్నాడు కంగారుగా. అమ్మగారి మాటంటే సుగ్రీవాజ్ఞ మరి.

• • •  • • •  • • •

"మీ కోసం ఎవరో వచ్చారండీ" అంది సుబ్బారావును తట్టి లేపుతూ అతని భార్య అంది.

"ఎవరు" అన్నాడు నిద్రలోంచి లేవకుండానే.

"ఎవరోనండీ చాలా మంది వున్నారు".

సుబ్బారావు మత్తు క్షణంలో దిగిపోయిది. ఆశ్చర్యంగా బయటకు వచ్చాడు. గుమ్మం ముందు అష్టదిగ్గజాల్లా నిలబడి వున్న ఎనిమిదిమంది మనుషులు ఏక కంఠంతో "దయగల మహా ప్రభువులు" అంటూ అరిచి సుబ్బారావు కాళ్లమీద పడి సాష్టాంగ నమస్కారం చేసారు. "అయ్యన్నండీ నా పేరు" పరిచయం చేసుకొన్నాడు నాయకుడు. "నాకు చందాలిచ్చే అలవాటు లేదు. ఇక దయచేయండి" గంభీరంగా అన్నాడు సుబ్బారావు.

"మీ పేరు చెబితే ఎటువంటి పనైనా అవుతుందని ఈ ఊరంతా తెలుసు. కనుక మా అందరికి రిక్షాలు లోనులో ఇప్పించి పుణ్యం కట్టుకోండి. నెలనెలా వాయిదాలు కడతాం" వచ్చిన పని చెప్పాడు నాయకుడు.

"ఇదేమన్నా ధర్మ సత్రమా! నేనేమయినా ధర్మరాజునా రిక్షాలు లోనులో ఇప్పించడానికి" పైకి విసుక్కున్నాడు సుబ్బారావు, లోలోపల తనకు ఇంత ప్రాధాన్యత ఇచ్చినందుకు ఉబ్బిపోతూ.

"సార్! నేను రిక్షావాళ్ళకు ప్రెసిడెంటుని. నమ్మకానికి పెట్టింది పేరు. తమరా ధర్మప్రభువులు. మీరు మాకు రిక్షాలిప్పించారంటే మా ఎనిమిది రిక్షాల్లో మీరు గాని, మీ ఇంట్లో మనుషులు ఎవరైనాగాని ఎప్పుడయినా, ఎక్కడయినా ఫ్రీగా పోవచ్చు. మేముమీ దగ్గర రిక్షాలకు కూలి తీసుకోమని మనవి చేసుకొంటున్నాము" అన్నాడు నాయకుడు. మిగతావాళ్ళంతా అవునన్నట్లు తల లూపారు.

ఇంట్లో అందరికీ రిక్షాలు ఫ్రీ అనేసరికి సుబ్బారావు గుండె ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. ఒక్క క్షణం ఆలోచించి, అందర్నీ మరుసటి ఉదయం రమ్మని, లోను ఇప్పిస్తానని అభయ హస్తం పారేసాడు.

మరునాడు ఉదయం వినయవిధేయతలతో నమస్కారం చేసి తన ఇంటిముందు నిలబడ్డ అష్టదిగ్గజాలను తనతో బాంకుకు తీసుకెళ్లాడు సుబ్బారావు. ఆ రోజు తను పని చేసే ప్రైవేటు కంపెనీకి సెలవు పడేసాడు. సుబ్బారావుకి ఎమ్మెల్యే గారి ద్వారా బ్యాంకు మేనేజరు తెలుసు. అందుకే బ్యాంకు మేనేజరు సుబ్బారావును సాదరంగా ఆహ్వానించాడు.

బాంకు మేనేజరు వాళ్ళిచ్చిన అప్లికేషన్లు పరిశీలించి "ష్యూరిటీ ఏమిస్తారు" అంటూ సుబ్బారావు వైపు చూసాడు.

సుబ్బారావు వాళ్ళవైపు చూసాడు. అష్టదిగ్గజాలు రెండు చేతులెత్తి తమ దగ్గర సెకండు హాండులో కొన్న బట్టలు, దేవుడిచ్చిన శరీరం తప్ప మరేమీ లేదన్నట్లు సంజ్ఞ చేశారు.

సుబ్బారావుకు మనసులో 'రిక్షాలు-ఫ్రీ సర్వీసు' పదే పదే మెదులుతుండడంతో తన ఇల్లును ష్యూరిటీగా పెట్టాడు. దాంతో మేనేజరు సంతోషించి లోను శాంక్షనుకు సంబంధించిన పనుల్లో మునిగిపోయాడు.

అష్టదిగ్గజాల ముఖాలు నక్షత్రాల్లా వెలుగుతూ వుంటే, సుబ్బారావు నక్షత్ర మండలంలోని చంద్రుడిలా ప్రకాశించసాగాడు. చక్రవర్తికి అభివాదం చేసినట్లు అతనికి అడుగు అడుగుకు సమస్కారం చేస్తూ సుబ్బారావును పొగడ్తలతో ముంచేసారు అష్టదిగ్గజాలు.

ఇప్పుడు కొత్త రిక్షాలతో అష్టదిగ్గజాలు కళకళలాడిపోతున్నారు. సుబ్బారావు, అతని కుటుంబ సభ్యులు కింద కాలు పెట్టడం లేదు. సుబ్బారావు కంపెనీకి రిక్షాలో వెడుతున్నాడు. పూర్వం భార్యగాని, పిల్లలుగాని ఎంత పోరు చేసినా నడిపించేవాడేగాని రిక్షాకు పైసా పెట్టేవాడు కాదు. ఇప్పుడు పిల్లలు స్కూలుకు పోవాలన్నా, భార్య షాపింగుకు వెళ్లాలన్నా, బంధువులు వస్తున్నా రిక్షాలు సిద్ధంగా వుండాల్సిందే. రోడ్డు మీద రొదపెడుతూ పరుగెత్తే టౌను బస్సుల్లా, ఆ ఎనిమిది రిక్షాల్లో ఏదోఒకటి దారిలో తటస్థ పడుతూ వుండేవి. గుప్తులకాలం నాటి స్వర్ణయుగంలా వుంది సుబ్బారావు పని.

• • • • • • • • •

ఆరోజు సుబ్బారావు ఇంటి ముందు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. రోజూ ఉదయం పది గంటలకొచ్చే రిక్షా పదకొండు గంటలయినా రాలేదు. వంతు ప్రకారం ఈ రోజు ఎలమంద రిక్షా రావాలి. వాడు రాకపోతే పోయింది. వాడి ముఠాలో వాళ్ళు ఒక్కరూ కనిపించరే అనుకొన్నాడు. చివరకు ఒక నిశ్చయానికి వచ్చి వీధి చివరివరకూ నడిచివెళ్ళాడు. అక్కడొక ముసలిరిక్షా వాడు కనిపిస్తే వీళ్ళంతా ఎక్కడికి పోయారని అడిగాడు.

“ఆళ్ళు ఇంకెక్కడున్నారు బాబూ. అద్దరేత్తిరి పెళ్ళాం పిల్లలతో గుడిసెలు కాలీజేసి లారీలో ఎల్లిపోయిన్రు. మద్రాసు పోయిన్రో, మహరాట్ర పోయిన్రో తెలవదు. ఆళ్లని నమ్మడానికి లేదు సామే. దొంగలంజాకొడుకులు” ముసలివాడు పళ్ళు కొరుకుతూ కోపంగా అన్నాడు.

అంతే! సుబ్బారావు గుండె కొట్టుకోవడం మానేసింది. ఒకొక్కరు నెలకు వంద చొప్పున ఇరవై అయిదు వాయిదాలు కట్టాలి. అయితే వాళ్ళు కట్టింది అయిదు వాయిదాలు మాత్రమే. అంటే నాలుగువేలు తీరిపోయిందన్నమాట. ష్యూరిటీ ఇచ్చినందుకు మిగిలిన పదహారువేలు తను కట్టాలి. ఎంత ఘోరం? సబ్బారావు దుఃఖంతో కుంగిపోయాడు.

ఆలోచనల్లోంచి తేరుకుని, కర్తవ్యం స్ఫురించగా పోలీస్ స్టేషన్‌వైపు పరుగెత్తాడు పూర్ సుబ్బారావు.

నమస్కారాలతో తను ఎందరికో మస్కా కొడితే, చివరకు రిక్షా వాళ్లు తనకే మస్కా కొట్టారు ✸

***(జ్యోతి మంత్లీ, ఆగస్టు, 1984)***